
# సత్యవాక్యము

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

JANUARY - 2008

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2007 నవంబరు 28 నుండి డిశంబరు 12వ తేదీ వరకు జాషువా గూటంగారి కుమారులు రిక్కీగూటం, రాబిన్ గూటంగార్లు థాయ్‌లేండ్ దేశములో పర్యటించిరి. ముఖ్యముగా చీంగ్‌మయి పట్టణంలో జరిగిన ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో వారిద్దరుపాల్గొనిరి. ఆ లెక్చర్‌షిప్‌లో రిక్కీగారు మూడు సార్లు ప్రసంగించి, హాజరైనవారందరి ప్రశంసలనందు కొనిరి. సింగపూర్,మలేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కొరియా, ఇండొనేషియా మొదలగు దేశముల నుండి సువార్తికులు, మిషనెరీలు ఆ సభలకు హాజరై గొప్పసహవాసముననుభవించిరి. డిశంబరు 2 నుండి 7 వరకు లెక్చెరర్‌షిప్ జరిగెను. 2008వ సంవత్సరపు ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్ కాకినాడలో జరుగుటకు తీర్మానించడమైనది. అందు నిమిత్తము పాఠకులు పట్టుదలతో ప్రార్ధించమనవి.

2007 డిశంబరు 28,29,30వ తేదీలలో రిక్కీ రాబిన్ గార్లు బేంగ్‌కాక్‌లో యున్న క్రీస్తుసంఘముతో కలిసి సమయాన్ని గడిపిరి. ఆ మహాపట్టణములోని ప్రముఖ ప్రాంతములను దర్శించిరి.

2007 డిశంబరు 14వ తేదీ శుక్రవారం పిఠాపురం జగ్గయ్యపేటలో జరిగిన కూటములో రిక్కీగారు వాక్య పరిచర్యచేసిరి. అక్కడ పి.సత్యానందంగారు సువార్త చాటుచున్నారు.

డిశంబరు 12వ తేదీ బుధవారం రామచంద్రపురం మండలం ఓదూరులో యున్న క్రీస్తుసంఘము ఆలయ నిర్మాణము నిమిత్తము సేకరించిన స్థలములో ఆలయము కొరకైన పునాది జాషువా గూటంగారి చేతుల మీదుగా వేయబడినది. స్థానిక సంఘస్థుల సహాయ సహకారములతో స్థల సేకరణ, ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించబడినవి ఓదూరులోను, అగ్రహారంలోను సోదురులు పులగల సుందర్రావుగారు ఓపికతో పట్టుదల కలిగి నమ్మకమైన సువార్త సేవచేయుచున్నారు.

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.O.Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | జనవరి 2008 | సంచిక 6


## మానవుని తత్వము - 2
(The Nature of Man - 2)

మానవుని తత్వాన్ని గూర్చి గతపాఠంలో కొంత తెలిసికొన్నాము. మానవుడు దేవునిచే సృజింపబడిన వ్యక్తి, వివేక విశిష్టమైన వ్యక్తి, నైతిక స్వేచ్ఛ గలవాడు మరియు మనస్సాక్షి గలవాడని కూడ మనం గతసంచికలో గమనించాము. అంతేకాదు మానవుడు కనీసం రెండు తత్వాలు, అంటే శారీరక తత్వం, ఆత్మీయతత్వం గలవాడని కూడ మనం గమనించాము.

మానవుని సంపూర్ణ తత్వమంతయు శరీరము, జీవము, ఆత్మయని అపొ.పౌలు చెప్పుచున్నాడు. "మీ ఆత్మయు, జీవమును, శరీరమును మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడయందు నిందారహితముగాను సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడునుగాక" యని అతడు 1 థెస్స 5:23లో చెప్పాడు. శరీరము అనగా భౌతికదేహము. జీవమనగా ప్రాణమును లేక మానవుని జీవమును సూచించును. ఐగుప్తీయులను గూర్చి చెబుతు దేవుడు "మరణము

నుండి వారి ప్రాణమును తప్పింపక వారి జీవమును తెగులునకు అప్పగించెను" అని దావీదు వ్రాసాడు (కీర్తన 78:50). ఆత్మయనగా అమర్త్యమైన మానవుని తత్వము. ఆత్మయను మాటకు ఇంగ్లీషులో Soul మరియు Spirit అను పదములు సరిసమానముగావాడబడెను. మానవుడు శరీరము, ఆత్మయని లేఖనములు చెప్పుచున్నవి.

"క్రీస్తు మీలో నున్నయెడల మీ శరీరము పాపవిషయమై మృతమైనది గాని మీ ఆత్మ నీతి విషయమై జీవము కలిగియున్నది" యని రోమా 8:10లో వ్రాయబడియున్నది. ఇక్కడ శరీరము మర్త్యమైనదని ఆత్మ అమర్త్యమైనదని మరల వక్కాణించబడెను. "కావున మేము అధైర్యపడము; మా బాహ్య పురుషుడు కృశించుచున్నను, ఆంతర్య పురుషుడు దినదినము నూతన పరచబడు చున్నాడు" అని అపొ.పౌలు చెప్పెను (2 కొరింథి 4:17). మానవుడు బాహ్య పురుషుడు, అంతరంగ పురుషుడని వర్ణించబడినప్పుడు పౌలు మానవుని మిశ్రమము తత్వమును మరల సూచించాడు. మానవుని శరీరములో మానవుని ఆత్మ నివసించును.

"దానియేలను నేను నా దేహములో మనోదుఃఖము గలవాడనైతిని" యని దానియేలు పలికెను (దానియేలు 7:15). మనుష్యుని యొక్క యధార్థమైన "నేను" అనునది అతని శరీరములో నివసించు అదృశ్య ఆత్మ. మనుష్యుల అంతరంగములో జీవాత్మను సృజించువాడు యెహోవా యని జెకర్యా ప్రవక్త చెప్పెను (జెకర్యా 12:1). "అయినను నరులలో ఆత్మయొకటి యున్నది. సర్వశక్తుడగు దేవుని ఊపిరి వారికి వివేచనకలుగ జేయును'' అని యోబు 32:8లో వ్రాయబడి యున్నది. గనుక మానవుడు శరీరములో నివసించుచున్న ఒక ఆత్మ. ఆ యాత్మయే అతని నిజవ్యక్తిత్వము.

మానవుని ఆత్మ దేవుని నుండి ఉద్భవించినందు వలన అది తండ్రియైన దేవునివలె అమర్త్యమైనదని బైబిలు బోధించుచున్నది. "దేవుడు ఆత్మయై యున్నాడు" (యోహాను 4:24). మన శరీరసంబంధులైన తండ్రులకు వ్యత్యాసముగా దేవుడు మన ఆత్మలకు తండ్రి (హెబ్రీ 12:9). మనము దేవుని సంతానమై యున్నామని అపొ.పౌలు ప్రకటించాడు. "కాబట్టి మనము దేవుని సంతానమై యుండి మనుష్యుల

చమత్కార కల్పన వలన మల్చబడిన బంగారమునైనను, వెండినైనను, రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంప కూడదు" (అపొ.కా. 17:29) అని అతడు చెప్పాడు.

దేవుడు ఆత్మయైయున్నాడు. మానవుని ఆత్మ దేవుని సంతానమై యున్నది. ఆత్మ దేవుని నుండి కలిగినది గనుక అది మానవుని అమర్త్యభాగమై యున్నది. అమర్త్యమనగా మరణంలేనిది, నిత్యము ఉండునదియని అర్థం. శరీరము ద్వారా అతడు దేవుని స్వరూపమందున్నాడు. ఏ జాతినుండి ఆ జాతియే ఉద్భవించును. మానవుని ఆత్మ అమర్త్యమైనది. దేవుడు నిత్యుడు. యుగయుగములకు ఆయనే దేవుడు (కీర్తన 90:1-2). ఆయన సమస్త జీవమునకు ఆధారభూతుడు. తనంతటతానే జీవముగలవాడు (యోహాను 5:26). మరియు దేవునివలె మానవుడు అమర్త్యుడు. ఏలయనగా అతని ఆత్మ దేవుని ఆత్మీయ స్వరూపమందు సృజింపబడెను.

"దేవుని శాశ్వతకాల జ్ఞానమును నరుల హృదయమందుంచి యున్నాడు" (ప్రసంగి 3:11). "నరుని ఆత్మ యెహోవా పెట్టిన దీపము" (సామెతలు 20:27). మానవుని హృదయాంతరంగ పురుషుడు అక్షయమైన వాటితో అలంకరింపబడ వలెనని అపొ.పేతురు చెప్పాడు. "సాధువైనట్టియు మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగ నుండవలెనని" అతడు చెప్పాడు (1 పేతురు 3:4). "అది దేవుని దృష్టికి మిగుల విలువగలది" హృదయాత్మల అంతరంగ పురుషుడు అసలైన మానవుడు. శరీరము మాత్రమే మర్త్యమైనది. "చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి" యని పౌలు చెప్పాడు (రోమా 6:12). "మృతులలో నుండి క్రీస్తు యేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింపజేయును" (రోమా 8:11). చావునకు లోనైనది శరీరమే గాని ఆత్మకాదు. పునరుత్థానమందు శరీరము కూడా అమర్త్యమైనదగును (1 కొరింథీ 15:42-45).

మానవుని ఆత్మ అమర్త్యమైనది. అది

గాలిని, ఊపిరి సూచించక మానవునిలో వివేక విశిష్టమైన భాగమును, మరణమునొందని ఆత్మను సూచించుచున్నది. మానవుడు దేవుని స్వరూపమందు ఆయన పోలిక చొప్పున సృజింపబడ్డాడు. దేవుడు భౌతికకాయుడు కాదు గనుక మానవుని శరీరాకృతులు అతని తల్లిదండ్రుల నుండి సంక్రమించినవి. దేవుడు ఆత్మ గనుక మానవుడు దేవుని ఆత్మీయ స్వరూపమందు చేయబడినవాడు. అందువలన అతడు నైతిక తత్వమును, ఇంగిత జ్ఞానాన్ని, వివేచన శక్తిని కలిగియున్నాడు. దైవాత్మ లక్షణములగు ప్రేమ, సంతోషము, దీర్ఘశాంతము, మంచితనము వగయిరాలను మానవుడు కూడా కలిగియున్నాడు.

మానవుని ఆత్మ మానవుని సంగతులనెరిగి యున్నది. "ఒక మనుష్యుని సంగతులు అతనిలో నున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరిఎవరికి తెలియును? "అలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకేగాని మరి ఎవనికి తెలియవు. దేవుని వలనమనకు దయచేయబడిన వాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను గాక దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము" (1 కొరింథీ 2:11-12). పౌలు దేవుని ఆత్మతో సేవించెను. మనస్సుతోను సేవించెను (1 కొరింథీ 14:15). మానవుని ఆత్మమంటిలో నుండి గాక నిత్య దేవుని నుండి కలిగెను. గనుక ఆత్మ నిత్యము ఉండునట్టిది. శరీరము క్షీణించి పోయినను అది జీవించునట్టిది.

అందువలన యెహోవాచే సృజింపబడిన మానవుడు మరణానంతరము కూడా జీవించునట్టి అమర్త్య ఆత్మయైయున్నాడు. కంటికి కనబడు అతని భౌతిక కాయము విషయమైతే అతడు మర్త్యుడు; కాని మరణములేని, దేవుని నుండి కలిగిన అంతరంగిక జ్ఞానము గల ఆత్మ విషయమైతే అతడు అమర్త్యుడు.

మానవుడు రెండు లోకాలతో సంబంధము కలిగియున్నాడు. అతడు ఈ లోకంలో జీవించుచున్నాడు అయినను పరలోకం అతని నిత్య గృహాం. అతడు ప్రస్తుతము జీవించుచున్నను, నిత్యత్వాన్ని గూర్చిన ఆసక్తి కలవాడు. అతడు నిత్యత్వంలో ప్రవేశించి సుఖంగా యుండడానికి దేవుని సంకల్పమును తెలిసికొనవలసి యున్నది. "మంటినుండి పుట్టిన వాడెట్టి

వాడో మంటినుండి పుట్టిన వారును అట్టివారే, పరలోక సంబంధి యెట్టివాడో పరలోక సంబంధులును అట్టివారే. మరియు మనము మంటి నుండి పుట్టిన వాని పోలికను ధరించిన ప్రకారము పరలోక సంబంధి పోలికయు ధరింతుము" అని అపో.పౌలు చెప్పాడు (1 కొరింథి 15:48-49).

మానవుడు భౌతికజీవి. మానవుడు ఆత్మీయజీవికూడాను. అతడీ లోకంలో జీవిస్తు పరలోకంలో జీవించడానికి నిశ్చయించుకోవాలి. నేటి గురించి అతడు ఆసక్తిని చూపించుచు, నిత్యత్వం గురించి మరింత ఆసక్తి కలిగి యుండాలి. అతడు మర్త్యుడే అయినను, అమర్త్యుడుకూడాను. "కావున దేహమందున్నను దేహమును విడిచినను, ఆయన కిష్టులమై యుండవలెనని మిగుల అపేక్షించుచున్నాము. ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథి 5:9-10).

"ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే; దేవుని యందు భయ భక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను; మానవకోటికి ఇదియే విధి" (ప్రసంగి 12:13). ఈ లోకంలో జీవిస్తుయుండగా, యేసుప్రభువు నందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందవలెను. మరియు,మరణ పర్యంతము ఆయనకు నమ్మకముగా జీవించవలెను. మనం నమ్మకముగా యున్నట్లయితే నిత్యజీవకిరీటాన్ని ఆయన మనకు ప్రసాదించును (ప్రకటన 2:10). పాపము నుండి విమోచించి పరలోకంలో చేర్చుకొనును.

-------- 0 --------

# సంఘము యొక్క ఆత్మ
# (Spirit of the Church)

సంఘ సంబంధముగా పరిశుద్ధాత్ముని యొక్క పనిని గూర్చి అనేకులు నేడు తడబడుచున్నారు. ఈ అంశముపై బైబిలు ఏమి బోధించుచున్నదో ఈ పాఠములో నేర్చు కొందము.

మనము పాతనిబంధననుండి ఆరంభింతము. యోవేలు ఇట్లు ప్రవచించెను : "తరువాత నేను సర్వజనుల మీద నా ఆత్మను కుమ్మరింతును మీ కుమారులును, మీ కుమార్తెలును ప్రవచనములు చెప్పుదురు; మీ ముసలివారు కలలు కందురు. మీ యౌవనస్థులు దర్శనములు చూతురు. ఆ దినములలో నేను పనివారిమీదను, పనికత్తెల మీదను నా ఆత్మను కుమ్మరింతును. యెహోవా సెలవిచ్చినట్లు సీయోను కొండ మీదను యెరూషలేములోను తప్పించుకొనిన వారందరు, శేషించిన వారిలో యెహోవా పిలుచువారు కనబడదురు. ఆ దినమున యెహోవా నామమునుబట్టి ఆయనకు ప్రార్థనచేయు వారందరు రక్షింపబడుదురు'' (యోవేలు 2:28,29,32).

"ఇక్కడ నిలచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని" క్రీస్తు తన శిష్యులతో పలికెను (మార్కు 9:1). అప్పటికి అతి త్వరలో స్థాపింపబడ బోవుచున్న సంఘమే ఇక్కడ చెప్పబడిన రాజ్యము (మత్తయి 16:18–19). అది బలముతో లేక పరిశుద్ధాత్మ శక్తి యొక్క నడిపింపుతో వచ్చునను సంగతిని కూడ నీవు గమనించుము.

ఆయన అతి తర్వలో పరమున కెక్కి పోవలసియుండెనని క్రీస్తు ఎరుగును. ఆయన వ్యక్తిగతముగా అపొస్తలుల నేర్పరచుకొని వారికి అనేక సంగతులను బోధించి, తర్ఫీదునిచ్చినను కొంత నడిపింపు లేనిదే వారు అనేక సంగతులను మరచిపోయి తాము చేయవలసిన పనిని చేయలేరని ఆయన ఎరుగును, గనుక ఆదరణకర్తను అనగా పరిశుద్ధాత్ముని వారియొద్దకు పంపుదుననియు, ఆయన వారిని నడిపించుటయేగాక యేసు యేమైతే వారికి బోధించెనో ఆసంగతులను వారికి

జ్ఞాపకము చేయుననియు ఆయన వారికి వాగ్దానము చేసెను. వారు దేవుని యొద్దనుండి వచ్చిన వారని ప్రజలు విశ్వసించునట్లు వారు అద్భుతములు చేయుటకును, వారెక్కడికి వెళ్ళినను అక్కడ ప్రజల భాషలో బోధించునట్లును పరిశుద్ధాత్ముడు వారికి శక్తినిచ్చును. "నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియైన ఆత్మ మీ కనుగ్రహించును. లోకము ఆయనను చూడదు; ఆయనను ఎరుగదు గనుక ఆయన మీతోకూడ నివసించును, మీతో ఉండును" అని యేసు వారికి చెప్పెను (యోహాను 14:16-17). "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26). "తండ్రి యొద్దనుండి నేను పంపబోవు ఆదరణకర్త అనగా తండ్రి యొద్దనుండి బయలుదేరు సత్య స్వరూపియైన ఆత్మ వచ్చి నప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును" (యోహాను 15:26-27). "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13).

యేసు పరమందున్న తండ్రి యొద్దకు వెళ్ళకముందు తన శిష్యులను ఆయన చుట్టూ సమకూర్చి, "క్రీస్తు శ్రమపడి మూడదినమున మృతులలోనుండి లేచుననియు, యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారు మనస్సును, పాప క్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు. ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందవరకు పట్టణములో నిలిచియుండుడని వారితో చెప్పెను" (లూకా 24:46-49). "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకును నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను"

(అపొ.కా. 1:8).

చివరిగా, సంఘస్థాపనను గూర్చి అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయములో మనము చదువగలము. ఈ మాటలను వినుడి: "పెంతెకొస్తు పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒక చోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలి వంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలల వంటి నాలుకలు విభాగింపబడి నట్టుగా వారికి కనబడి వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగా అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్ శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాట్లాడసాగిరి'' (అపొ.కా. 2:1-4). పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిన ఈ మనుష్యు లెవరు? ఆదరణకర్తను ఎవరి యొద్దకు పంపుదునని క్రీస్తు వాగ్దానము చేసెను? అవును, అపొస్తలులకే, అంతేగాక యేసు, మార్కు 9:1లో చెప్పిన శక్తి యిదే. ఏలయనగా ఆ శక్తి వలన వారు ఇతర భాషలలో మాటలాడ సాగిరి. ఇట్టి ఆశ్చర్యకరమైన సంగతిని వివరించుచు పేతురు యిట్లనెను: "యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి యిదే, ఏమనగా-అంత్య దినములయందు నేను మనుష్యులందరి మీద నా ఆత్మ కుమ్మరించెదను. మీ కుమారులును, కుమార్తెలును ప్రవచించెదరు. మీ యౌవనులకు దర్శనములు కలుగును, మీ వృద్ధులు కలలు కందురు" (అపొ.కా. 2:16-17).

ఆ దినమందు పేతురును, మిగిలిన అపొస్తలును కూడి వచ్చిన ప్రజలకు సువార్తను బోధింపసాగిరి. దాని విషయమై లేఖనములు ఇట్లు చెప్పుచున్నవి: వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని- సహోదరులారా మే మేమి చేతుమని పేతురును, కడమ అపొస్తలులను అడుగగా, పేతురు మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు, ఈ వాగ్దానము మీకును, మీ పిల్లలకును, దూరస్థు లందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచినవారికందరికిని చెందునని వారితో చెప్పెను..... కాబట్టి

అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి, ఆ దినమందు ఇంచు మించు మూడువేలమంది చేర్చబడిరి.... మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" (అపొ.కా. 2:37-39,41,47).

లేఖములను చదువుట ద్వారా అపొస్తలులును, కొర్నేలి యింటివారును మాత్రమే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి యని మనము గ్రహించుకొనగలము. సువార్త బోధించుట యందు, ఉపదేశించుట యందు నడిపింపబడు నిమిత్తమును, క్రీస్తు వాగ్దానము చేసినరీతిగ సంఘము నాటబడుటకును అపొస్తలులు దానిని పొందిరి. వారు దేవుని మనుష్యులని ప్రజలు నమ్ము నిమిత్తము అపొస్తలులే యితర భాషలలో మాట్లాడిరి. అద్భుతములు, మహత్కార్యములు అనేకములు చేసిరి. అప్పటికి క్రొత్త నిబంధన లిఖితపూర్వకముగా ఇయ్యబడలేదు గనుక అట్టి అద్భుత సహాయము అవసరమాయెను. కొర్నేలి యింటివారితో సహా అన్యజనులుగా యున్న వారు కూడ యూదులవలె దేవునికి అంగీకార యోగ్యులే యని నిరూపించుటకు కొర్నేలి యింటివారు దానిని పొందిరి (అపొ.కా. 10:1).

చేయువలసిన పని నంతటిని అపొస్తలులే చేయలేనందున మరికొందరు కూడ అద్భుతములు చేయగల్గునట్లు వారిపై అపొస్తలులు చేతులుంచు అధికారము కలిగి యుండిరి. అట్టి సందర్భములో ఏర్పరచుకొనబడినవారు బాప్తిస్మము పొంది, పరిశుద్ధాత్మ వరమును పొంది, సంఘ సభ్యులై యుండినవారు. అయితే అపొస్తలులు వారిమీద చేతులుంచుట ద్వారా మాత్రమే వారు పరిశుద్ధాత్ముని యొక్క అద్భుత శక్తిని పొందగలిగిరి. అపొ.కా. 6:1-3 మరియు అపొ.కా. 8:5-25లను చదువుము. ఈ అద్భుత శక్తిని యితరులు పొందగల్గునట్లు అపొస్తలులు మాత్రమే వారిపై చేతులుంచు అధికారమును కలిగియుండిరి. గనుక వారును, వారు చేతులుంచిన వారును మరణించగా అద్భుతములు చేయు కాలము గతించిపోయెను; ఏలయనగా అప్పటికి క్రొత్తనిబంధన సంపూర్తిగ లిఖింపబడి యుండెను. గనుక అద్భుతములు,

అన్యభాషలు మాటలాడుట మొదలగువాటి అవసరతయిక లేకపోయెను; ఏలయనగా సత్యమును తెలిసికొను నిమిత్తము బోధింపబడు సంగతులు అవునో కాదో నిర్ధారణ చేసికొను నిమిత్తము ఒకడు దేవుని వాక్యమును పరిశోధింప వచ్చును (1 కొరింథీ13; యాకోబు 1:25; యోహాను 20:30-31).

సంఘము ఆరంభమయిన నాటినుండి అపొస్తలులు తప్ప ప్రభువునకు విధేయత చూపిన వారందరు (అనగా బాప్తిస్మము పొందిన వారందరు) పరిశుద్ధాత్మ అను వరమును పొందిరి. ఈ వరమును పొందినవారెవరికిని అద్భుతములు చేయుశక్తి లేదు. వారు ఆత్మను పొందిరి. ఆత్మ వారిలో నివసించెను. గాని ఆయన వారిలోగాని, లేక వారిద్వారాగాని అద్భుతములు చేయలేదు. అట్లుచేయు అవసరత ఏమియును లేదు. క్రైస్తవులందరు అద్భుతములు చేయు శక్తిని పొందియుంటే, వారందరు లోకమందంతటా కలుగజేయు గందరగోళమును నీవు ఊహింఛగలవు గదా? అందున్న శక్తివలన అనేకులు క్రైస్తవ్యమునకు ఆకర్షించబడుదురు. దేవుని వరమును ధనముతో సంపాదించవలెనని ప్రయత్నించిన సీమోను నీకు జ్ఞాపకమున్నాడా?

సంఘమునకు పరిశుద్ధాత్మ నేడు ఎట్లు వర్తించును? ప్రతి సభ్యుడుకూడ బాప్తిస్మము పొందినందువలన పరిశుద్ధాత్మ అను వరమును కలిగియున్నాడు. అనేకులు బోధించుదానికి వ్యతిరేకముగ ఈనాడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము లేదు. అందు వలన ఈనాడు అద్భుతములు చేయబడుట లేదు. క్రైస్తవులు, సంఘము కూడ ఆత్మ యొక్క మాటలు (క్రొత్తనిబంధన) వలన ఈనాడు నడిపింపబడుచున్నారు. ఆయన చిత్తము జరిగించబడుచుండగా మన జీవితములో కలుగు ఫలితము, ఆత్మ ఫలములు (గలతి 5:21-25). మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు (రోమా8:16). పౌలు ఇంకా ఇట్లు చెప్పుచున్నాడు: "అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్ధన చేయవలెనో మనకు తెలియదుగాని ఉచ్ఛరింపక శక్యముకాని మూలుగులతో ఆ ఆత్మ

తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు" (రోమా 8:26).

క్రైస్తవులవలె సంఘము కూడ ఆత్మ ద్వారా జీవింపజేయబడుచున్నది. గనుకనే "ఆత్మయు, పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు; వినువాడును రమ్ము అని చెప్పవలెను; దప్పిగొనినవానిని రానిమ్ము; ఇచ్ఛయించువానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము" అని వ్రాయబడియున్నది (ప్రకటన 22:17).

– జె.సి. ఛోట్

ప్రకటన గ్రంథ ప్రసంగ మాలిక – 18

# దుష్ట త్రయం
## (The Evil Trinity)

**పరిచయము :**
ప్రకటన గ్రంధము గ్రహించుకోవాలంటే మొదటి శతాబ్దపు వాతావరణాన్ని, సందర్భమును గుర్తుంచుకోవాలి. ఆ కాలమందు జీవించిన వారికి ప్రకటన గ్రంధము యేమి చెప్పుచుండెను? అని ప్రశ్నించుకోవాలి.

☞ ఈ అధ్యాయంలో సాతానుడు అతని సాధనములైన రెండు క్రూరమృగములను గూర్చి తెలిసికొన బోవుచున్నాము. వీరు దుష్టత్రయం.

☞ సాతానుడు భూమిపైకి పడద్రోయబడెను. అతని సమయం సంకుచితం. అందువలన సాధించ గలిగినంత కీడు అతడు చేయుటకు ప్రయత్నించును. అతని దుష్టశక్తిని రెండు క్రూరమృగములకిచ్చుటను మనం చూడబోవుచున్నాము.

**సముద్ర క్రూరమృగము** (13:1–10).
☞ యోహాను ఒక క్రూరమృగమును చూచెను. అది సముద్రములో నుండి పైకివచ్చెను.

☞"సముద్రము" ఇక్కడ ప్రజలను సూచించుచున్నది. (ప్రక 17:1-15).

☞ఆ మృగమునకు ఏడు తలలుండెను. "ఆ యేడు తలలు ఆ స్త్రీ కూర్చున్న యేడు కొండలు" (ప్రక 17:9). అనగా అది రోమా పట్టణము! లేదా రోమా సామ్రాజ్యము !!

☞ఆ మృగమునకు పది కొమ్ములుండెను. "నీవు చూచిన ఆ పది కొమ్ములు పదిమంది రాజుల" అని 17:12లో చెప్పబడియున్నది.

☞ ఆ పది కొమ్ముల మీద పదికిరీటములుండెను. యివి రాజరికము చేయు రాజుల కిరీటములు.

☞"దాని తలల మీద దూషణకరమైన పేళ్లును ఉండెను". రోమా చక్రవర్తులు తమ్మును తాము ప్రభువు, దేవుడు, దేవుని కుమారుడు అని వర్ణించుకొనే వారు. ఈ మాటలు మానవులకు వర్తింపజేయబడు నప్పుడు దేవ దూషణ కరమైనవి.

☞ఆ మృగము చిరుతపులిని పోలి యుండెను. దాని పాదములు ఎలుగు బంటిపాదముల వంటివి, దాని నోరు సింహపు నోరు వంటిది. దానికి ఆ ఘటసర్పము తన బలమును సింహాసనమును గొప్ప అధికారమునిచ్చెను.

దానియేలు 7:1-8లోని మృగము కూడ యిట్లు వర్ణించబడెను.

ఈ రెండు లేఖన భాగములను పోల్చిచూద్దాం.

1. ఈ రెండు మృగములు సముద్రలో నుండి వచ్చెను. (ప్రక 13:; దాని 7:13).

2. ఈ రెంటికీ పదేసి కొమ్ములుండెను (దాని 7:7).

3. ఈ రెండు చిరుతపులి, ఎలుగుబంటి, సింహములను పోలియుండెను

4. ఈ రెండు దేవదూషణ చేసెను

5. ఈ రెండు పరిశుద్ధులతో యుద్ధము చేసెను (ప్రక 13:7; దాని 7:21).

☞ఈ యుద్ధము 42 నెలలు పాటుండెను

☞ఆ ఘటసర్పము తన శక్తిని ఈ క్రూరమృగమున కిచ్చుట గమనించుము. ఆ ఘటసర్పము అబద్ధ ప్రవక్త యని వర్ణించబడెను (ప్రక 16:13; 19:20).

☞దాని తలలో ఒక దానికి చావు దెబ్బ తగిలినట్లుండెను; అయితే ఆ చావు దెబ్బ మాని పోయెను. గనుక భూజనులందరు మృగము వెంటవెళ్లుచు ఆశ్చర్యపడుచుండిరి.

☞ప్రపంచ చరిత్ర చూస్తే దుష్ట ప్రభుత్వములు నాశనమయి నట్లు

...ప్పుడును గాని వాటి వెనుకనే దుష్ట ప్రభుత్వములు మరల వచ్చును.

☞క్రైస్తవులను హింసించు మానవ ప్రభుత్వములు సాతానుయొక్క ప్రతినిధులు. అట్టి ప్రభుత్వములు వస్తూనే యుంటాయి. చివరకు ప్రజలు వాటిని ఎదురించుట వల్లకాదని వాటి వెంట వెళ్లవచ్చును.

☞ఆమృగమునకు డంబపు మాటలను దేవ దూషణలు వలుకు నోరు ఇయ్యబడెను (4-6 వచ).

☞అది దేవుని దూషించెను, దేవుని నామమును దూషించెను.

అది దాని తత్వము. దేవుని గుడారమును దూషించెను. అనగా సంఘమును దూషించెను (ఫిలిప్పీ 3:20).పరలోక నివాసులను దూషించెను (ఎఫెసీ 1:21).

☞పరిశుద్ధులతో యుద్ధము చేయను, వారిని జయింపను దానికి అధికారమియ్యబడెను. దానియేలు 7:21 చదువుము.

☞ఈ సందర్భములో ప్రకటన 13:7; 11:7ను కలిపి చదువుము.

గొర్రెపిల్ల యొక్క జీవగ్రంధ మందు తమ పేర్లు వ్రాయబడని వారు ఆ మృగమునకు నమస్కారము చేతురు.

☞క్రైస్తవులు హింసింపబడితే వారు చెరగొనిపోబడ వచ్చును. వారు సణుగ రాదు. వారు బలప్రయోగము వలన తమ్మును తాము రక్షించుకొనకూడదు. ఈ విషయంలో పరిశుద్ధుల ఓర్పును విశ్వాసమును కనబడును (10వ).

**భూమినుండి వచ్చిన క్రూరమృగము: (13: 11-18).**

☞భూమిలో నుండి వచ్చిన క్రూరమృగము, మానవజాతి వాడు.

☞గొర్రెపిల్ల వంటి రెండు కొమ్ములు దానికుండెను గాని అది ఘటసర్పము వలె మాటలాడు చుండెను.

☞కొమ్ములు అధికారమునకు గురుతు. యేసుకు 7 కొమ్ములుండెను! (ప్రక 5:6).

☞యిది గొర్రెపిల్ల వంటి కొమ్ములు కలిగగినను సాతానువలె ఘటసర్పమువలె ప్రవర్తించెను.

☞రోమా సామ్రాజ్యపు అధికారము ఈ క్రూరమృగమునకు బలమిచ్చుట వలన అది చక్రవర్తి ఆరాధనను అమలుపరచెను.

☞డొమిషియన్ చక్రవర్తి ప్రతిమకు నమస్కారము చేయవలెనని రోమా ప్రభుత్వము ప్రజలను బలవంతము చేసెను (12వ).

☞అది సూచక క్రియలను చేయగలిగెను. ఫరో యొక్క మాంత్రికులు కూడ సూచక క్రియలను చేయగల్గిరి. (11-15 వచ). 2 థెస్స 2:9 చదువుము.

☞క్రూరమృగము యొక్క ముద్ర యేమిటి?

☞సైనికులు వారి యధికారుల నామమును తమపై ధరిస్తు యుండేవారు.

☞బానిసలకు ముద్రవేయబడేది. వారు పారిపోయినా ముద్రను బట్టి గుర్తించగలిగేవారు.

☞ప్రక 7:3లో దేవుడు తన వారికి ముద్రవేసినట్లు చూడగలము. అది నిజముగా భౌతికంగా వేయబడిన ముద్ర కాదు. గాని దేవుని ప్రజలు దేవుని కాపుదలలో యుందురని గ్రహింపు.

☞మృగము యొక్క ముద్ర కలిగిన వాడు తన జీవితములో పాపము యొక్కయు, అపవాది యొక్కయు ప్రభావమును కనుపరచును.

☞దేవునిచే ముద్రింపబడిన వారు అల్పసంఖ్యాకులే గనుక వారికి ఆర్థిక యిబ్బందులు తప్పవు (17వ). మృగము యొక్క ముద్ర ధరించిన వారు దేవుని ప్రజలను హింసించుటలో ప్రభుత్వాలకు సహకరింతురు, క్రైస్తవులకు ఆర్థిక యిబ్బందులు కలుగజేతురు.

☞మొదటి శతాబ్దములో కైసరు చక్రవర్తిని ఆరాధించే వారికి ఒక ధృవ ప్రతము ఇయ్యబడేది.

ఆ పత్రము కలిగిన వాని ప్రాణనకు హాని యేమి జరిగేదికాదు. ఆర్థిక యిబ్బందు లుండేవి కావు.

☞"బుద్ధిగలవాడు మృగము యొక్క సంఖ్యను లెక్కింపనిమ్ము. అది యొక మనుష్యుని సంఖ్యయే; ఆసంఖ్య ఆరువందల అరువదియారు; ఇందులో జ్ఞానము కలదు" (18వ).

☞ఏడు పరిపూర్ణ సంఖ్య, ఆరు పరిపూర్ణతకు లోపించిన సంఖ్య. 888 పూర్వం గ్రీకులు క్రీస్తుకు వర్తించిన సంఖ్య 888 పరిపూర్ణ తను మించిన సంఖ్య. 666 పరిపూర్ణతకు లోపించిన సంఖ్య. 6 ఎల్లవేళల అసంపూర్ణతను, దుష్టత్వాన్ని సూచించును.

☞క్రూరమృగము యొక్క దినములు దగ్గరయ్యాయి. క్రూరమృగము యొక్క సంఖ్య మానవుని సంఖ్యమే. దేవుని సంఖ్య 7. మానవుని సంఖ్య ఆరు. ఆరు అపజయాన్ని సూచించును. గనుక క్రూరమృగమునకు (666) అపజయం,అపజయం, అపజయం. క్రూరమృగము మానవునిలో మానవుని పనులలో ఘనతనొందగోరును.

తత్ఫలితముగా విఫలమొందును.

[ఁ]క్రైస్తవులను హింసించు ప్రభుత్వములు పతనమగును. అబద్ధ బోధలు నశించును గాని యేసు క్రీస్తువిజేయుడగును. ఆయన వలననే విజయం.

**ముగింపు :**

మనం ఒక యద్ధములో యున్నాము. సాతానుడు మన బద్ధ శత్రువు. అతడు ఇప్పటికే ఓడిపోయాడు. అతడు ఎవరి ద్వారా పని చేయగోరునో వారందరు ఓటమిపాలవుదురు. క్రూరమృగము, దాని ముద్రలు పగయిరా భవిష్యత్తులో జరిగే సంఘటనలు కానేకావు. నీవు క్రీస్తువాడవైతే దేవునిచే ముద్రించబడిన వాడవు. అపవాది సంబంధివైతే వానిచే ముద్రించబడిన వాడవు.

**క్రీస్తు సంఘములు సమర్పించుచున్న**

**సత్యవాణి కార్యక్రమములను**

ప్రతి శనివారం ఉదయం 6:30 గంటలకు తేజ ఛానల్‌లోను మరియు T.V. - 5లోను ఉదయం 6:30 నుండి 7:00 వరకు, ప్రతి సోమవారం నుండి శుక్రవారం వరకు ఉదయం 6:00 నుండి 6:30 వరకు తిరిగి రాత్రి 10:00 నుండి 10:30 వరకు శుభవార్త ఛానల్‌లో చూడండి.

**ప్రసంగీకులు :** Bro. జాషువాగూటం గారు
Bro. రిక్కీగూటం గారు

# పితరులు

ముందు పాఠమునందు మానవుని సృష్టి నుండి జలప్రళయము వరకు జరిగిన చరిత్రను బైబిలు నుండి పరిశీలించాము. జలప్రళయం ఐన తరువాత వెంటనే జరిగిన సంఘటనలను గూర్చి కూడా చదివాము. ఈ పాఠము నందు మనం పితరులను గూర్చి వారి సంతానము గూర్చి వారు ఐగుప్తు చెరలో గొప్ప జనాంగముగా తయారగుటను గూర్చి నేర్చు కొనగలం. సృష్టి మొదలుకొని మోషేకు ధర్మశాస్త్రమును గ్రహింపబడి నంతవరకూ 'పితరుల యుగమని యందురు'. ఎందుకనిన పితరులు ఆత్మీయనాయకులుగా యీ తరమందు వ్యవహరించిరి.

పితరులు అనగా తండ్రి – ముఖ్యమైన ముగ్గురు అబ్రహాము, ఇస్సాకు, యాకోబు. వీరు హెబ్రీ జాతికి మూలపురుషులు. ఈ హెబ్రీ జాతి వారే ఇశ్రాయేలు, యూదా అని పిలవబడ్డారు.

**అబ్రహాము**

అబ్రహాము నోవహు కుమారుడైన షేతు వంశమునాడు. ఇతడు "ఊరు" పట్టణమున జన్మించెను. ఇది కల్దీయ దేశమునందు కలదు. ఈ కల్దీయ దేశము ప్రస్తుతవు ఇరాక్ నందు దక్షిణ ప్రాంతమున ఉండెడిది. దేవుని దృష్టికి అబ్రహాము చాలామంచి వాడుగా కనబడెను. అంతకు ముందు అతని పేరు అబ్రాము. దేవుడు అబ్రహామును తాను చూపింపబోవు దేశమునకు స్వజనములకు విడిచి వెళ్ళమని ఆజ్ఞాపించెను. దేవునికి విధేయత చూపించుట ద్వారా ఆయన అబ్రహామునకు ఆశీర్వాదములు వాగ్దానము చేసెను (ఆది 12:1-7).

1. గొప్ప జనముగా నిన్ను ఆశీర్వదించుదును. అబ్రహాము ఇశ్రాయేలీలకు తండ్రియగుట.

2. ఆయనను గొప్పవానిగా చేయుట. అబ్రహాము ఇప్పటికి కూడా యూదులద్వారాను, క్రైస్తవుల ద్వారాను గౌరవింపబడుచున్నాడు.

3. దేశమును వాగ్దానము చేసెను. కానాను అనబడు దేశము దానికే పాలస్తీనాఅను వేరొక పేరుగలదు. దీనిని

ఇశ్రాయేలు జనాంగమునకు దేవుడను గ్రహించుట.

4. అబ్రహాామును ఆశీర్వదించువారిని దేవుడు ఆశీర్వదింతుననియు అబ్రహాామును శపించువానిని తాను శపించుదుననియు దేవుడు వాగ్దానము చేసెను. పాతనిబంధన చరిత్రను చదివిన యెడల ఇశ్రాయేలు ప్రజలతో (దేవునిచే ఏర్పరచుకొనబడిన జనాంగము) పొరుగు దేశములవారు ప్రవర్తించిన తీరు పొందిన ప్రతిఫలమును మనము గ్రహించగలము.

5. అబ్రహాము ద్వారా సర్వభూప్రపంచము ఆశీర్వదింపబడుట. ఇదియేసు క్రీస్తు నందు నెరవేర్చబడినది ఎందుకనగా యేసుక్రీస్తు అబ్రహాము సంతానము నుండి ఉద్భవించినవాడు. దేవుడు ఇశ్రాయేలీయులను ప్రత్యేక జనాంగముగా ఎన్నుకొనుటలో గల ముఖ్య ఉద్దేశ్యము లోకరక్షకుని వారినుండీ రప్పించుటయే. అబ్రహాము దేవునికి విధేయుడై ఆయన చూపించు దేశమైన కానానునకు తన స్వంత పట్టణమైన 'ఊరు' ను విడిచిపెట్టి వెళ్ళిపోయెను. ఆదికాండము 12 నుండి 25వ అధ్యాయము వరకు చదివిన అబ్రహాము ఆ దేశములో నివసించినప్పుడు జరిగిన ప్రాముఖ్యమైన సంఘటనలు మనము గ్రహించగలము అచటనే తన సహోదరుని కుమారుడైన లోతు ఆయనను విడిచిపెట్టి బహు దుర్మార్గులైన సొదొమ అను పట్టణములో జీవించుటకు నిర్ణయించుకొని వెళ్ళిపోయెను. దేవుడు సొదొమ గొమొఱ్ఱాలను నాశనము చేతునని చెప్పినప్పుడు లోతు అచ్చట జీవించుచున్నందువల్ల అబ్రహాము ఆపట్టణములను నాశనము చేయవద్దని దేవునితో వాదించెను. కానీ తగినంతమంది నీతిమంతులు లేనందువల్ల దేవుడు ఆరెండు పట్టణములను అగ్నితో నాశనము చేసెను. లోతు ఆ మంటల నుండి రక్షించబడెను కానీ అతని భార్య అవిధేయత వలన వెనుకకు తిరిగినందువల్ల ఉప్పు స్తంభమాయెను. "మనము సదాకాలము దేవునికి విధేయత చూపించువలయుననుటకు ఇది చక్కని గుణపాఠము". శారా దాసియైన హాగరు ద్వారా అబ్రహామునకు పెద్ద కుమారుడు కలిగెను. అతని పేరు ఇష్మాయేలు. అబ్రహాము 100 సం॥ వయసప్పుడు ఇస్సాకు జన్మించెను. ఇష్మాయేలు అరేబియా ప్రజలకు తండ్రి

అయ్యెను. దేవుడు అబ్రహామునకు ఇస్సాకును అనుగ్రహించుట ద్వారా తన వాగ్దానమును నేరవేర్చినప్పుడు అతడు చూపిన విధేయత దేవుని యందు అబ్రహామునకు గల గొప్ప విశ్వాసమునకు ఇది గొప్ప తార్కాణము. దేవుడు అబ్రహామునకు కలిగిన అత్యున్నతమైన విశ్వాసమును చూచినప్పుడు అతని చేయిపట్టుకొని ఇస్సాకును చంపవద్దని ఇస్సాకు ప్రాణమును కాపాడెను. హృదయములను కదిలించే ఈకధను ఆదికాండము 22వ అధ్యాయములో చదువుము. అబ్రహాము తన 175వ యేట చనిపోయెను. అతనిని "మెక్పిలా" నందుగల రాతి సమాధిలో అతని భార్యాయైన శారాప్రక్కన పాతిపెట్టిరి.

## ఇస్సాకు

పితరులలో రెండవవాడు ఇస్సాకు ఇతడు 180 సంవత్సరములు బ్రతికాడు. అబ్రహామునకు చేసిన వాగ్దానము ఇస్సాకునకును దేవుడు చేసెను. నీయందు భూమిలోనీ సకల జనులు ఆశీర్వదించబడుదురను వాగ్దానము అది. ఇస్సాకు తన మామ కుమార్తెయైన రిబక్కాను పెండ్లి చేసుకొనెను. ఏశావు, యాకోబు అను కవలలు వీరికి జన్మించిరి. చిన్నవాడైన యాకోబు ద్వారా దేవుడు తన వాగ్దానములను నెరవేర్చెను.

## యాకోబు

మూడవ పితరుడైన యాకోబు దేవుని చేత ఇశ్రాయేలు అని పిలవబడెను. ఇశ్రాయేలు కుమారులు అని యాకోబు సంతతివారు పిలువబడిరి. ఏశావు యొక్క జ్యేష్టత్వమును యబ్బ అల చందలతో కొనెను (ఆది 25). ఏశావుకు చెందవలసిన ఆశీర్వాదములను తండ్రిని మోసగించి యాకోబు పొందెను (ఆది 27). అలాగు ఏశావు కోపమునకు గురియై యాకోబు హారానునందలి తన మేనమామ యింటికి పారిపోయి రాహేలును భార్యగా పొందునట్లు 7 సంవత్సరములు ఆయనకు సేవచేసెను. కానీ మేనమామ యాకోబును మోసము చేసి రాహేలును కాక ఆమె అక్కయైన లేయాను యిచ్చి పెండ్లి చేసెను. కనుక యాకోబు ఇద్దరి సోదరిలను పెండ్లి చేసుకొని ఇంకొక 7 సం॥లు మామగారికి సేవ చేసెను. ఈ వృత్తాంతమును ఆది 28,29 అధ్యాయముల యందు చదువుము. యాకోబునకు 12 మంది కుమారులు ఒక కుమార్తె కలరు. కుమార్తె పేరు దీన

12 మంది కుమారులు ఇశ్రాయేలు 12 గోత్రములకు కర్తలైరి. యాకోబు 12 మంది కుమారుల వృత్తాంతము యోసేపు జీవిత చరిత్రయందు బాగుగా చెప్పబడినది. యోసేపు తన తండ్రికి అతి ప్రియమైన కుమారుడు. బైబిలు నందలి వ్యక్తులలో యోసేపు అతి ప్రాముఖ్యమైనవాడు ఆయన అతి పవిత్రమైన జీవితమును జీవించాడు. యోసేపును యాకోబు ఎక్కువగా ప్రేమించుటను బట్టి మిగిలిన సోదరులు అతని యెడల బహు అసూయ చెంది ఐగుప్తు వారికి దాసునిగా అమ్మివేసి తండ్రికి క్రూరమృగము యతనిని చంపి వేసినదని చెప్పిరి. దైవ నిర్ణయమును బట్టి యోసేపు ఐగుప్తు రాజు యొక్క అంగ రక్షకుల యధిపతియగు పోతీఫరు యింట సేవకుడయ్యెను. అతడు తప్పు చేయునప్పటికి చెరసాలలో బంధించబడెను. తరువాత రాజు యొక్క కల, రాబోవు సమృద్ధియైన 7 సం॥ పంట ఆ తరువాత 7 సం॥ కరవును సూచించెనని భావము చెప్పెను. రాజు సంతసించి యాతని తన తరువాత యధిపతిగా రాజ్యముపై నియమించెను. సమృద్ధిగా పండిన పంటనంతటినీ 7 సం॥లు యోసేపు సమకూర్చి భద్రపరచి కరవు సం॥ కోసము వుంచెను.కరవు కారణముగా యాకోబు మిగిలిన 11 మంది కుమారులలో చిన్నవానిని తప్ప మిగిలిన 10 మందినీ ఐగుప్తు పంపి ధాన్యము తెమ్మనెను. అక్కడ వారు తాము అమ్మిన తమ తమ్ముడైన యోసేపును మొట్టమొదట చూచిరి. వారందరూ మరలా కలుసుకొనుటను చదివిన యెడల అది హృదయమును బహుగా హత్తుకొను వృత్తాంతము. యోసేపు వారిని క్షమించి యాకోబు కుటుంబమంతటినీ ఐగుప్తునకు రప్పించెను. ఈ చక్కని వృత్తాంతము ఆదికాండము 42-46 అధ్యాయములయందు కలదు. కనుక చదువుము.

యాకోబు, యోసేపులు మరణానంతరము ఇశ్రాయేలు కుమారులు బహుగా విస్తరించారు. వారు ఐగుప్తులో 430 సం॥ (నిర్గ 12:40) వున్నప్పటికి 70 మందిగా వచ్చినవారు స్త్రీలు పిల్లలుకాక పురుషులు 600,000 మందిగా వృద్ధి చెందారు. ఈలోపు యోసేపును ఎరుగని వేరొక ఫరో ఈజిప్టును పరిపాలించుట మొదలు పెట్టాడు. అతడు ఇశ్రాయేలు జనాంగమునకు సరియైన

సదుపాయములు కల్పించకుండా వారిని బానిసలుగా చేశాడు. కనుక దేవుడు వారిని చెర నుండి విడిపించుటకు మోషేను ఏర్పాటు చేశాడు. మోషే యొక్క వృంత్తాంతము చదువుటకు చాలా అద్భుతంగా వుంటాది. అతని పుట్టుక రాజు నుండి రక్షించటానికి అతని తల్లి దండ్రలు అతనిని తొట్టెలో పెట్టి నైలునదిలో విడచి పెట్టుట, రాజు కుమార్తె యతని కనుగొనుట, యతని రాజ్యవారసునిగా అనగా యువరాజుగా పెంచుట దైవ చిత్తాను సారము అతడు సింహాసనము వదలి దేవుని ప్రజల విమోచనము కొరకు పాటుపడుట చాలా అద్భుతముగా వుండును.

మోషేయు అతని అన్న అహారోనును ఇద్దరూ కలసి రాజు యొద్దకు వెళ్ళి ఇశ్రాయేలీయులను ఈజిప్టునుండి విడిచి పెట్టమని కోరిరి. దేవుడు పది తెగుళ్ళు ఈజిప్ట వారిమీదికి రప్పించువరు ఫరో వారిని వెళ్ళ నియ్యలేదు. ఆఖరి తెగులు చాలా భయంకరమైనది. అదే దినమున ఈజిప్టు వారిలోని ప్రతీ తొలుచూలు చనిపోవుట. ప్రతీ కుటుంబము లోనివారూ చివరికి ఫరో కుటుంబములో కూడా చావు సంభవించెను. పితరులను గూర్చిన పూర్తి వృత్తాంతము ఆదికాండము 12 నుండి నిర్గమకాండము 12 వరకు చదువుము. ఇశ్రాయేలీయులు ఈజిప్టును ఎట్లా విడిచిపెట్టి 40 సం॥లు అరణ్యములో సంచరించారో తరువాత చదువుకుందాం.

సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీ యింటిలోనే పూర్తిచేసి బైబిలు జ్ఞానమును పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.

SATYAVANI, P.O.Box-80, KAKINADA - 533 001.

గమనిక : సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపిచవలయును.

## HEAR THE VOICE OF TRUTH
## ON RADIO SRILANKA

**TELUGU** : Sunday, Monday, Wednesday & Thursday,
2:00 p.m. 2.15 p.m

**T.V.** : Every Saturday 6:30 a.m. on Teja & TV-5 Channels.
Speakers: Joshua Gootam & RickyGootam.

**HINDI** : Sunday 6:45 p.m. 7:00 p.m. and
Thursday, 6:45 p.m. 7:00 p.m.
Speaker: Sunny David,

**TAMIL** : Monday, Tuesday, Wednesday, Thursday and
Friday 5:30 p.m. to 5:45 p.m.
Speaker: P.R. Swamy.

**MALAYALAM** : Friday, 3:45 p.m. 4:00 p.m.
Speaker: P.K. Varghese.

## సత్యవాణి T.V. కార్యక్రమములు
(2008 జనవరి నుండి)

ప్రతి శనివారం T.V - 5 ఛానల్‌లో ఉదయం 6.30 నుండి 7:00 వరకు

ప్రతి సోమవారం నుండి
శుక్రవారం వరకు

**శుభవార్త ఛానల్ లో**

ఉదయం 6:00 నుండి 6:30 వరకు
రాత్రి 10:00 నుండి 10:30 వరకు

ప్రసంగీకులు : Bro. జాషువా గూటంగారు
Bro. రిక్కీ గూటంగారు

డిశంబరు 24వ తేదీన పిఠాపురంలో సోదరులు వై. రాంబాబుగారి గృహము వద్ద ఏర్పాటు చేయబడిన కృతజ్ఞత కూటములో జాషువాగారు, రిక్కీగార్లు వాక్యపరిచర్యచేసిరి. అనేకులు హజరై దేవుని స్తుతించిరి.

డిశంబరు 29వ తేదీ శనివారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం తామరాడలో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును రిక్కీగూటంగారు రిబ్బను కత్తిరించి ప్రార్ధనపూర్వకముగా ప్రతిష్టించిరి. ఆ కూటమునకు పరిసర ప్రాంతపు సువార్తికులు యన్. మోజెస్, యమ్. జోసఫ్గార్లు తదితర్లు హాజరైరి. రిక్కీగారు చక్కటి వాక్యపరిచర్యచేసిరి.హాజరైన వారందరిలో దూరము నుండి వచ్చినవారికి స్ధానిక సంఘము మంచి భోజనము నేర్పాటుచేసిరి.

2008 జనువరి నుండి ప్రతి శనివారం సత్యవాణి T.V. కార్యక్రమము TV- 5 ఛానల్లో కూడ ఉదయం 6:30గంటలకు ప్రసారము చేయబడును.


**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2006-2008**


**To**

From:

SATYA VAKKU

**P.O. Box 80, Kakinada - 533 001**


Edited & Published by Joshua Gootam Printed by Him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004